# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 52 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే | గురువారం | 22-5-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.





## ప్రచారం కోసం ఇంతగా దిగజారాలా

- అశోక వర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్‌కు చివాట్లు
- బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,
హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మదాబాద్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఆయన పెట్టిన పోస్టును ఉద్దేశిస్తూ న్యాయస్థానం మందలించింది. పబ్లిసిటీ పొందేందుకు ఇలాంటి చర్యలు ఎందుకంటూ ప్రశ్నించింది. తనకు బెయిల్ మంజూరుచేసి విచారణ నిలిపివేయాలని ఇటీవల అలీఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

-మిగతా 2 లో



## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

- ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ,మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్ర లో ఏకంగా

-మిగతా 2 లో

## ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం

- ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ
- తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యం
- రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం

-మిగతా 2 లో





## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

- కేసీఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర
- ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం
- కేసీఆర్‌కు నోటీసులపై కేటీఆర్ విమర్శలు

నల్లగొండ, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్

-మిగతా 2 లో



## ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

- ప్రతికూల వాతావరణ పరిస్థితులు

నల్లగొండ,
తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసర ల్యాండింగ్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం మేళ్లచెరువులో హెలికాప్టర్ ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, కమ్ముకున్న మబ్బులు, గాలివాన నేపథ్యంలో అప్రమత్తమైన పైలట్ వాతావరణ శాఖ సూచన మేరకు కోదాడలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. కోదాడ నుంచి హుజూర్ నగర్ కు రోడ్డు మార్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్ బయలుదేరుతారని అధికారులు వెల్లడించారు.

## బలూచీ పేలుడులో భారత్ హస్తం

పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన ఇండియా



న్యూఢిల్లీ మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బలోచిస్థాన్‌లో పాఠశాల బస్సు లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో పలువురు చిన్నారులు మృతి చెందారు. అయితే ఈ విషయంలో భారత్ ప్రమేయం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. సొంత వైఫల్యాల నుంచి ప్రపంచ దృష్టిని మరల్చే ప్రయత్నంలో భాగంగా

-మిగతా 2 లో


## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు


- ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ



విశాఖపట్టణం/హైదరాబాద్,
తెలుగు రాష్ట్రష్టాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత

-మిగతా 2 లో





## తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్


మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం

ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతం

- ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా
- వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం
- గణపతి తరవాత బాధ్యతలు చేపట్టిన నంబాల
- కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి

బీజాపూర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు

-మిగతా 2 లో



## ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు

- కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం
- నోటీసులు అందాక స్పందిస్తా..విచారణకు హాజరవుతా
- మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ స్పష్టీకరణ



హైదరాబాద్,
కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ..కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం

-మిగతా 2 లో

# ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్‌ను రెండు ముక్కలు చేసి శాస్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచక్షణ కోల్పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మొట్టమొదట కేంద్రానికి అండగా నలిచింది తెలంణ ప్రభుత్వమని. క్యాండిల్ ర్యాలీ తీసి కేంద్రానికి, బలగాలకు అండగా నిలిచామని అన్నారు. ఆ రోజు తాము చేసిన దానికి అభినందించడానికి నోరు కూడా రాలేదని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అసువులు బాసారని, రాజీవ్ విగ్రహంపై సంకుచిత ఆలోచనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం అంతా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దేశ ప్రజల హక్కులను, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.

## బలూచీ పేలుడులో భారత్ హస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. అంతేకాకుండా స్థానిక సమస్యలకూ భారత్‌ను నిందించడం దాయాది దేశానికి అలవాటుగా మారిందని మండిపడింది.'ఖుజ్దార్‌లో చోటుచేసుకున్న దాడిలో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నాం. అటువంటి ఘటనల్లో మరణించిన వారికి భారత్ సంతాపం తెలిపింది. అయినప్పటికీ.. సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం తోపాటు ఉగ్రవాదానికి అంతర్జాతీయ కేంద్రంగా పేరుగాంచిన వారు, ప్రపంచ దృష్టి మరల్చేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు. వారి అంతర్గతంగా ఉన్న అన్ని సమస్యలకు భారత్‌ను నిందించడం పాక్‌కు పరిపాటిగా మారింది' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచాన్ని మోసగించేందుకు పాక్ చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలు విఫలం అవుతున్నాయని అన్నారు. బలోచిస్థాన్‌లోని ఖుజ్దార్ ప్రావిన్స్‌లో ఓ పాఠశాల బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. 38 మంది తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి వేర్పాటువాద గ్రూపులు ఈ దాడికి పాల్పడివుండవచ్చని అనుమానిస్తున్నారు.

## ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది.

# రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది.

# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘఢ్

(మొదటి పేజీ తరువాయి)

(70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు.



శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్‌ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్దాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు.

## ప్రచారం కోసం ఇంతగా దిగజారాలా

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈసందర్భంగా అలీఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. తన క్లయింట్ ఆ పోస్టులో నేరపూరిత ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలు ఏమున్నాయ్ అని వాదించారు. ఆయన వాదనపై స్పందిస్తూ జస్టిస్ కాంత్ మాట్లాడారు. 'అసలు ఏం జరుగుతోందో మీరు తెలుసుకోండి. భావ వ్యక్తీకరణ చేసే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం గురించి మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. భారత్‌కు స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి అందరూ హక్కుల గురించి మాట్లాడుతున్నారు. కానీ, బాధ్యతల గురించి ప్రస్తావించడం లేదు. భావ వ్యక్తీకరణ చేసే హక్కు కచ్చితంగా ఉంటుంది. కానీ, వీటన్నింటి గురించి మాట్లాడే సమయం ఇదేనా..? కొందరు రాక్షసులు వచ్చి భారత్‌పై దాడి చేశారు. ఇప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలి. ఇలాంటి సమయంలో పబ్లిసిటీ పొందేందుకు ప్రయత్నాలు ఎందుకని మందలించారు. కాగా.. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న కారణంతో హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. రాజనీతి శాస్త్ర విభాగంలో అలీఖాన్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశాల్లో వివరించిన కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను ఆయన తప్పు పట్టారు. 'ప్రభుత్వం తరఫున మాట్లాడుతున్న వారు క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవాలను మాత్రమే వివరించాలి. లేకపోతే అది వంచనే అవుతుంది' అని పోస్టు పెట్టారు.

## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

(మొదటి పేజీ తరువాయి)

వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్టులు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది.

సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్‌ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమీషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమీషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్-ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## 2025 మే 22, గురువారం తెలుగు పంచాంగం



మాసం - పక్షం
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
తిథి
దశమి: మే 22, తెల్లవారుజామున 3:19 నుండి మే 23, తెల్లవారుజామున 2:16 వరకు
నక్షత్రంపూర్వాభాద్ర: మే 22, సాయంత్రం 6:05 వరకు
ఉత్తరాభాద్ర: మే 22, సాయంత్రం 6:05 నుండి మే 23, సాయంత్రం 5:03 వరకు
సూర్యోదయం సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:45
సూర్యాస్తమయం: సాయంత్రం 6:38
చంద్రోదయం -చంద్రాస్తమయం
చంద్రోదయం: రాత్రి 1:29
చంద్రాస్తమయం: మధ్యాహ్నం 1:14
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:10 నుండి 4:58 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:46 నుండి 12:38 వరకు
అమృతకాలం: సాయంత్రం 5:40 నుండి 7:17 వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:49 నుండి 3:26 వరకు
యమగండం: ఉదయం 6:59 నుండి 8:36 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 9:31 నుండి 10:23 వరకు
మధ్యాహ్నం 3:11 నుండి 4:02 వరకు
వర్జ్యం: సాయంత్రం 4:39 నుండి 6:16 వరకు

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకొన్న తెలంగాణ గౌడ సంక్షేమ సంఘ నాయకులు!!



**కరీంనగర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా శ్రీ రేణుక మాతను గౌడ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ తిరుపతి గౌడ్ నాయకులు దర్శనం చేసుకొని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ రేణుకా మాత ఆశీస్సులు ప్రతి ఒక్క గౌడ బిడ్డకు ఉండాలని ఆ తల్లి ఆశీర్వాదం తోటి సుఖశాంతులు ప్రజలకు వెదజల్లాలని, అష్టైశ్వర్యాలు నిండు నూరేళ్లు కలకాలం జీవించాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఎంతో నిష్టతో చేసే రేణుకా మాత బోనాల కార్యక్రమాలు ఘనంగా బొమ్మకల్ గ్రామంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు ఈ సంవత్సరం రేణుకా మాత ఆశీర్వాదంతో గౌడ కులస్తులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ మండలం అధ్యక్షులు బుస శ్రీనివాస్ గౌడ్, తిమ్మాపూర్ మండలం అధ్యక్షులు రావుల శ్రీనివాస్ గౌడ్, మానకొండూర్ నియోజకవర్గం ఇంచార్జి గోపాగోని నవీన్ గౌడ్, బొమ్మకల్ గ్రామ గౌడ సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

### - షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతదేశ మాజీ ప్రధానమంత్రి,భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణంలోనీ ఫరూఖ్ నగర్ బాలికల పాఠశాల వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశం లో సాంకేతిక విప్లవం రావాలని నూతన శకానికి శ్రీకారం చుట్టారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయుడన్నారు.ఈ కార్యక్రమంలలో, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,రఘు నాయక్, జృమద్ ఖాన్,అందె మోహన్,సాయి వంశీ, హరినాథ్ రెడ్డి, ఇబ్రహీం,మురళి మోహన్, కొప్పునూరి ప్రవీణ్,రాజేష్ గౌడ్,ఖదీర్, మాధువలు,అర్జున్, సీతారాం,నవీన్,ఖదీర్,మంగ అశోక్, నీరటి వాసు, మన్నే రవి, రాజు,గంగమోని సత్తయ్య, సాయి కుమార్ ,శేకారప్ప ,రవితేజ,ముబారక్ అలీ ఖాన్,బచ్చలి నరేష్, విగ్నేష్ రెడ్డి, శంకర్, మహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాల్సిందే

-25 శాతం ఉచిత విద్య ఇవ్వకపోతే ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి
-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



**కరీంనగర్, మే 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘాలు విద్యాహక్కు చట్టాన్ని తాము అమలు చేయమని ప్రైవేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అర్హత గల 25 శాతం విద్యార్థులకు ఉచితంగా విద్యను ఇవ్వమని ప్రకటించడం సరికాదని వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ చెబుతున్న నిబంధనలను కూడా పట్టించుకోకుండా ప్రవేట్ పాఠశాలలు ఏకపక్ష నిర్ణయాలు సరికాదని ప్రతి ప్రవేట్ పాఠశాలలో తప్పనిసరిగా విద్య హక్కు చట్టం అమలు చేయాలని,ప్రతి పాఠశాల వారు ఈ విద్యాసంవత్సరం 15 నుండి 30%ఫీజులు పెంచుకున్నారని ఫీజులు పెంచుకున్నప్పుడు ఉచిత విద్య ఎందుకు ఇవ్వరని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖ వ్యవహారాలు చూస్తున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యహక్కు చట్టాన్ని అమలు చేయకపోతే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల కూడా విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదని ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడి చర్యలు తీసుకోవాలని ప్రతి పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు.

# హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనాలి.

-ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం కాబోతుంది.
-వేలాదిగా కాకుండా హిందూ ఐక్యతను చాటేందుకు లక్షలాదిగా తరలిరావాలి.
-ఈ యాత్ర విజయవంతంతో అర్బన్ నక్సల్స్ కు గుణపాఠం చెప్పాలి.
-ప్రతి గడప గడప నుండి యాత్రకు హిందువులు తరలివచ్చి సైనికులకు సంఘీభావం తెలపాలి.
-బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి పిలుపు.




**కరీంనగర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రతి ఏడాది కరినగర్ నడిబొడ్డున నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర ఈసారి మరో శకానికి నాంది పలికేలా ఉండాలంటే హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు గడప గడప నుండి లక్షలాదిగా తరలివచ్చి ఈ హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేసి “పహల్గాం మృతులకు అంకితం” చేసే విధంగా ఉండాలంటే ప్రతి హిందువు స్వచ్ఛందంగా ఈ హిందూ ఏక్తా యాత్రకు తరలిరావాలని న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించే ఈ హిందూ ఏక్తా యాత్ర తేదీ 22 మే 2025 గురువారం రోజున సాయంత్రం 4:00 గంటలకు కరినగర్ లోని వైశ్యభవన్ నుండి ప్రారంభమవుతుందని, ఈ యాత్రకు ముఖ్య అతిథిగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి, అఖిల భారత సాంస్కృతిక కళా ప్రముఖ్ శ్రీ అప్పాల ప్రసాద్ జీ పాల్గొంటున్నారని, ఈ యాత్ర వైశ్యభవన్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, సిపి ఆఫీస్, కలెక్టర్ క్యాంపు ఆఫీస్, మదీన కాంప్లెక్స్ నుండి తిరిగి మళ్లీ వైశ్యభవన్ కు చేరుకుంటుందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ హిందూ ఏక్తా యాత్రకు వేలాదిగా కాకుండా లక్షలాదిగా హిందూ బంధువులు తరలిరావాలని, ఈ యాత్ర విజయవంతంతో దేశంలో ఉంటూ, దేశానికి వ్యతిరేకంగా, హైందవ ధర్మానికి వ్యతిరేకంగా, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ పాకిస్తాన్ లాంటి ఉగ్రవాద దేశాలకు వంతపాడుతున్న అర్బన్ నక్సల్స్ అనే దేశద్రోహులకు గుణపాఠం చెప్పే విధంగా ఈ యాత్ర కొనసాగాలంటే ప్రతి హిందువు ప్రతి గడప గడప నుండి తరలిరావాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. ముఖ్యంగా ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం చేసేలా, భారత త్రివిధ దళాలకు సంఘీభావం తెలిపేలా ఉండబోతోందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా ఈ యాత్రలో తప్పకుండా పాల్గొని యాత్రను విజయవంతం చేసే విధంగా పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి కోరుతూ పిలుపునిచ్చారు.

## భారీ వర్షంతో తడిసిన ధాన్యం



**మనోహరబాద్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం కేంద్రంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ఉన్న ధాన్యం కుప్పలు తడిసాయి. దీంతో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారూ. ప్రభుత్వం తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో తడిసిన ప్రతి గింజ కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## విద్యాశాఖలో సమూల మార్పులకు సీఎం శ్రీకారం




**మహేశ్వరం, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తెచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రాథమిక స్థాయి నుంచే సమగ్ర ప్రణాళిక రూపొందించబడింది. ప్రభుత్వ బడులను నూతన దశలోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.ఇప్పటివరకు పట్టించుకోని ప్రాథమిక విద్య రంగంపై ఇప్పుడు ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 41,628 స్కూళ్లలో 60 లక్షల మందికి నాణ్యమైన నోట్బుక్స్ అందించనుంది. బోధనా ప్రమాణాలను మరింత బలోపేతం చేసేందుకు 11వేల మంది కొత్త ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు చేపట్టింది. టీచింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు వచ్చే నెల 6 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనుంది. మహిళా సంఘాలతో బడిబాట,విద్యాభివృద్ధికి మరో కీలక అడుగు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు లీడ్ ఇండియా – కేఎల్ఆర్ ట్రస్ట్’ సహకారంతో ప్రత్యేక స్కిల్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ రూపొందించనున్నారు అని గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ పాలనకు తెరదించి, విద్యారంగాన్ని కొత్త దారిలో నడిపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు.



**వెల్దండ,మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెల్దండ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు,ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్, తెలంగాణ ఉద్యమకారుడు కూన స్కైలాబ్ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఎంపిటిసి హనుమంత్ నాయక్, కోట్ర వెంకటేశ్వరరావు,కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్, మాజీ సర్పంచ్ అరుణ, ప్రభాకర్, వెల్దండ మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, బర్కత్ పల్లి ఉప సర్పంచ్ నరసింహ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జోగయ్య, చల్లా మధుసూదన్ రెడ్డి యువ నాయకులు జంగిలి ఆనంద్, కొమ్ము నాగేష్, గండికోట రాజు, సిద్ధ గొని రమేష్, కొండలు యాదవ్, నారాయణరెడ్డి, చొక్కన్న పల్లి మాజీ వార్డ్ నెంబర్ సాయిలు, ఈదులపల్లి శ్రీనివాసులు,జోగు రవికుమార్, కళాకారుడు వెంకటయ్య, మీసాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కు ఉత్తమ ఎస్‌హెచ్‌ఓ అవార్డు

**జగిత్యాల మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజలతో పోలీసులు ఎలా ఉండాలి అన్న దానికి జీవితం మీద నేర్పినట్టు పనిచేసిన అధికారి ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ కోడ్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలలో అత్యధిక సానుకూల స్పందన అందుకున్న స్టేషన్లలో ఇబ్రహీంపట్నం ఒకటిగా నిలవడంతో, ఎస్ఐ అనిల్‌కు ఉత్తమ ఎస్ హెచ్ఓ లుగా అవార్డు లభించింది.తెలంగాణ రాష్ట్రం మొత్తంలో ఎంపికైన టాప్ 10 పోలీస్ స్టేషన్ల జాబితాలో చోటుదక్కిన అనిల్‌కి, అందులోనూ అత్యుత్తమంగా గుర్తింపు లభించింది ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా ఎస్సై అనిల్ బెస్ట్ ఎస్ హెచ్ ఓ అవార్డు మరియు నగదు బహుమతి అందుకున్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక – నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# హిందూ ఏక్తా యాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించిన బిజెపి నాయకులు ..

**మే 22న జరిగే " హిందూ ఏక్త యాత్ర" ను విజయవంతం చేయండి...**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**




**కరీంనగర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హనుమాన్ జయంతి రోజున కేంద్ర మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న " హిందూ ఏక్తాయాత్ర ఏర్పాట్ల ను మంగళవారం రోజున కరీంనగర్లోని వైశ్య భవన్ వద్ద బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గంగా డి కృష్ణారెడ్డి నాయకులు కార్యకర్తలకు ఏక్తాయాత్ర పై పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న జరగబోయే హిందూ ఏక్తాయాత్రను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా , హిందూ బంధువులు అందరూ , యువత మహిళలు హిందూ ఏక్తాయాత్ర కు తరలిరాను న్నారని తెలిపారు. ప్రప్రదమంగా కరీంనగర్లో 13 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు , ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటితశక్తి , ఐక్యతకు దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. హిందూ ఏక్తాయాత్ర మరింతవైభవంగానిర్వహించడానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని వైశ్య భవన్ నుండి సాయంత్రం నాలుగు గంటలకు యాత్ర ప్రారంభమై, పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగుతుందని తెలిపారు.రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా యాత్రకు హాజరై విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు , జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , ఉపాధ్యక్షులు కన్న కృష్ణ , బండ రమణారెడ్డి, దండు కొమరయ్య, మాజీ కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, వంగల పవన్, సతీష్ , దుర్శెట్టి అనూప్ , మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయ శ్రీ , అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్, లడ్డు ముందాడా, చిట్టి కరుణాకర్ , అడిచెర్ల రాజు, తనకు సాయి , అవదుర్తి శ్రీనివాస్ దేవిశెట్టి నవీన్ కుమార్ కొల్లిపాక శ్రీనివాస్ జంగంపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసును చేదించిన షాద్ నగర్ ఎసిపి

**-సిహెచ్ రంగస్వామి, ఆయన బృందానికి అభినందనలు**


**-అభినందించిన డిజిపి జితేందర్**




**షాద్ నగర్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కడ్తాల్ పోలీస్ స్టేషన్ కేసును పరిష్కరించడంలో ఏసీపీ సిహెచ్ రంగస్వామి, మరియు ఆయన బృందం చేసిన కృషిని డీజీపీ జితేందర్ ఐపీఎస్ అభినందించారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్ ( క్రైమ్. నం. 130/24)లో సెక్షన్ 302, 202, 364, 120 B ఐపీసీ, మరియు ఎస్సీ / ఎస్టి చట్టంలోని 3(2)(V) కింద నమోదైన దారుణ హత్య కేసును గుర్తించి పరిష్కరించడంలో అత్యుత్తమంగా పనిచేసినందుకు ఎన్. సిహెచ్ . రంగస్వామి, ఏసీపీ షాద్‌నగర్, అప్పటి సీఐ శివ ప్రసాద్, ఎస్సై వర ప్రసాద్, మరియు హెూంగార్డ్ పాండు నేతృత్వంలోని బృందాన్ని డీజీపీ జితేందర్ ఐపీఎస్ ఈరోజు అభినందించారు. ఈ బృందం యొక్క అంకితభావం, వృత్తి నైపుణ్యం మరియు న్యాయం పట్ల నిబద్ధత ప్రశంసనీయం. దర్యాప్తు పురోగతి మరియు ఫలితం పట్ల డీజీపీ జితేందర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## వ్యక్తి అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు



**యాచారం,మే 21(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

వ్యక్తి అదృశ్యంపై హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినట్లు సిఐ కృష్ణంరాజు తెలిపారు. యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం నరసింహ (50) ఈ నెల 7 వ తేదీ ఉదయం 9 గంటలకు కూలి పనికోసం అని వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, చుట్టుప్రక్కల గ్రామాలలో వెతికిన ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కృష్ణంరాజు తెలిపారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

**జగిత్యాల మే 21(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ సాంకేతిక అభివృద్ధికి బాటలు వేసిన ముందు చూపు ఉన్న నేత దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత అని నాయకులు గుర్తు చేశారు. యువత, మహిళలు, రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ హయాంలో అమలైన పథకాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కల్లెడ గంగాధర్, మామిడి రాజశేఖర్ రెడ్డి, మొగిలి రాజేందర్, గోపిడి నరేశ్, కోరే రాజ్‌కుమార్, గోండు గణేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ పాఠశాలలో చదవడం నేరమా...



నాగారం గ్రామంలో పిలేర్ల దగ్గర ఆగిపోయిన పనులు




ఏకంగా ఒక క్లాస్ రూమ్ ని వంట గదిగా మార్చడం జరిగింది



బాయ్స్ టాయిలెట్స్ పరిస్థితి



కొత్తగా నిర్మించడం కోసం ముగ్గు పోసి దాదాపుమూడు సంవత్సరాలు

-పాఠాలు నేర్పరు.....పనులు చేయరు

-కోట్లల్లో నిధులు వచ్చి ఏడాది పైగా పూర్తి

-ముందుకు సాగని మన ఊరు మన బడి

-ఎలక్షన్లు వస్తే ఇదే ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం

-వచ్చేనెల జూన్ 12 నుండి పాఠశాలలో ప్రారంభం






ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ పరిస్థితి

**మహేశ్వరం,మే21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పెద్దపులినాగారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన ఊరు మనబడిలో భాగంగా అదనపు తరగతి గదులు డైనింగ్ హాల్ నిర్మాణ పనులు రూ" 94 లక్షలు నిధులు మంజూరయ్యాయి..గుత్తదారు కొత్త భవన నిర్మాణాలకు పిల్లర్లు వేసి వదిలేశారు. పనులు సాగడం లేదు,విద్యార్థులు గదులు సరిపోలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినీ,విద్యార్థులు అదనపు గదులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారుల తప్పిదం వలన ప్రధానోపాధ్యాయులు టీచర్లు ఉన్న గదులలోనే పాటలు నేర్పించడం జరుగుతుంది.అలాగే తరగతి గదిని వంటగది లేకపోవడంతో,వంటగది కోసం ప్రత్యేకంగా వాడడం జరుగుతుంది. మరియు మూత్రశాలలు సరిగ్గా లేకపోవడంతోవిద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏకంగా ఒక క్లాస్ రూమ్ ని పూర్తిగా నేలమట్టం చేసి కొత్తగా నిర్మించాలనుకున్నారు.ఉన్నదానికే దిక్కు లేదంటే కొత్త దానికి శ్రీకారం చుట్టారు.... మహేశ్వరం నియోజకవర్గానికి తొలి గడపగా చెప్పుకునే నాగారం గ్రామం ప్రభుత్వ పాఠశాల విధానం చూస్తే అర్థమవుతుంది ఇక్కడ ఎవరి తప్పిదం..పాలకులదా.... కాంట్రాక్టర్దా... ఎవరి నిర్లక్ష్యమైన సరే ఎదుర్కొనే సమస్య మాత్రం విద్యార్థులు మాత్రమే.ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి... నాగారం ప్రభుత్వ పాఠశాల ని పట్టించుకోవాలని చెప్పేసి గ్రామస్తులు వేడుకుంటున్నారు .

# సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

**-చెడుగా ప్రవర్తించే వారిపై నిఘా విభాగం దృష్టి సారిస్తుంది.**
**-పిల్లలకు చిన్నప్పటి నుంచే సంస్కారం నేర్పించాలి**
**-బాల్య వివాహల నిర్మూలన అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ రావుల గిరిధర్**



**వనపర్తి,మే 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** భావి సమాజ నిర్మాతలు నేటి ఉపాధ్యాయులని ఉపాధ్యాయులలో అనంతమైన శక్తి దాగి ఉంది విద్యార్థులకు బోధించి శక్తివంతులుగా తీర్చిదిద్దాలని ఎస్పీ శ్రీ లిరావుల గిరిధర్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉర్దూ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా రెండవ రోజు ఏ హెచ్ టి యు, సఖి, భరోస వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ లిరావుల గిరిధర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు డ్రగ్స్, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, గురించి అవగాహన కల్పించి విద్యార్థులకు బోధించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలనీ అన్నారు. తరగతి గదిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పౌరులను తయారు చేసే నిర్మాతలు గురువులని పేర్కొన్నారు. సమాజంలో విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని , వారికి స్పష్టమైన దిశ, దశను నిర్దేశించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందని ఆయన అన్నారు. ఒకనాటి పిల్లల బాల్యం నేటి పిల్లల బాల్యంలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రధానంగా క్రమశిక్షణతో పాటు సంస్కారాన్ని నేర్పాలని కోరారు. తల్లిదండ్రులు గురువులు తోటి సమాజాన్ని గౌరవించే విధానం చిన్నప్పటి నుంచే పిల్లల్లో అలవడాలని అన్నారు. అంతేకాక బాల్య వివాహాలు, నిరక్షరాస్యత డ్రగ్స్ , సైబర్ నేరాలు, చెడువ్యసనాలపై తల్లిదండ్రుల సమావేశం రోజున పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే షి టీం నిఘా వ్యవస్థ ఎప్పుడూ గమనిస్తూ ఉంటుందని, ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసే విషయాలను తెలియజెప్పాలని ఎస్పీ వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అందుకు ప్రతి ఉపాధ్యాయుడు తన వంతు కృషి చేయాలని ఆయన తెలిపారు. వనపర్తి జిల్లాలో విద్యని బలోపేతం చేసి పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యని పెంచి నాణ్యమైన విద్యను అందించి రాష్ట్ర స్థాయి ఫలితాలలో ఉత్తమ స్థానాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్, శ్రీనివాసులు, ఐ. సుదర్శన్ రావు, మల్లేశ్, మరియు సెంటర్ ఇంచార్జి శ్రీమతి జ్యోతి శిక్షణ కోర్స్ డైరెక్టర్ లు జ్యోతి, ఆనంద్,ఉమా దేవి, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు, చెన్నమ్మ తామస్, సఖీ సెంటర్ అడ్మినిస్టేటర్. కవిత, సెక్టోరియల్ అధికారులు, యుగంధర్, శేఖర్, డి ఎస్ ఒ శ్రీనివాసులు, ఏ హెచ్ టి యు ఎస్సై, అంజద్, భరోస సెంటర్ సిబ్బంది, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**-సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్**



**వనపర్తి,మే 22 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** తాలుతరుగు పేరుతో ప్రతి క్వింటలకు మూడు నుంచి ఐదు కిలోలు దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. వర్షాలు పడిన నేపథ్యంలో వనపర్తి మార్కెట్ యార్డును సిపిఐ నేతలు సందర్శించి చిట్యాలకు చెందిన రాము మరికొందరు రైతులతో మాట్లాడారు. మార్కెట్ యార్డులోప్రతి బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41 కిలోలు తూకం వేసి రైతులకు నష్టం చేస్తున్నారన్నారు. వీటిని లారీలలో మిల్లులకు పంపితే అక్కడ ప్రతి క్వింటాలుకు మూడు నుంచి ఐదు కిలోలు షార్టేజ్ పేరుతో మిల్లర్లు దోచుకుంటున్నారన్నారు. శ్రీరంగాపురానికి చెందిన కొందరు మిల్లర్లు బరితెగించి ఐదు కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే లారీల నుంచి ధాన్యం దించుకుంటామని, లేదంటే తీసుకెళ్లిపొమ్మని చెప్పేస్తున్నారన్నారు. చిట్యాల కు చెందిన కొందరు రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదు అన్నారు. దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ధాన్యం నిలువ చేసేందుకు మిల్లర్లపై ఆధారపడకుండా ప్రత్యేక గోదాముల వసతి అధికారులు కల్పించాలన్నారు.
మార్కెట్ యార్డ్ మైదానాన్ని వెంటనే మరమ్మత్తు చేయాలి వనపర్తి వ్యవసాయ మార్కెట్ మైదానాన్ని నీరు నిలవకుండా మరమ్మత్తు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ మైదానం నిర్మాణంలో లోపం ఉందన్నారు. పలుచోట్ల మైదానం పల్లంగా ఉందన్నారు. వర్షం వస్తే మీరు నిలిచి ధాన్యం తడుస్తోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మైదానంలో కాంటావేసి ఉంచిన బస్తాల కింద నీరు నిలిచి తడిసి పాడైందన్నారు. కొందరు రైతుల వి మొలకలు కూడా వచ్చాయన్నారు. మార్కెట్ యార్డులో నీరు నిలవకుండా లెవలింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణం చర్య తీసుకోవాలని కోరారు. నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.
**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.
చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# అండర్ పాస్ లో మళ్ళీ నిలిచిన నీళ్ళు.



**మనోహరబాద్, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మెదక్ జిల్లా మనోహరబాద్ మండలంలోని రామాయిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో బుధవారం అండర్ పాస్ లో వర్షం నీళ్ళు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 2018 లో జాతీయ రహదారి 44 రామాయిపల్లి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి గాను ప్రయాణికులకు ఇబ్బందిగా ఉండకూడదు అని అండర్ పాస్ నిర్మించారు. కానీ వర్షం కురిసిన ప్రతీసారి అండర్ పాస్ లోకి వర్షం నీళ్ళు రావడంతో అక్కడే నీరు నిలుస్తున్నాయి. దీంతో రాకపోకలు కూడా ఇబ్బందికరంగా మారుతుంది. వర్షం పడిన ప్రతి సారి కిలోమీటర్ల మేర వాహనాలు నిలుస్తున్నాయి. ప్రయాణికులు ఇతర మార్గాల్లో వెళ్ళాల్సి వస్తుంది. గతంలో ఈ అండర్ పాస్ లో ఒక కారు కూడా మునిగిపోయింది. బుధవారం కూడా నీళ్ళు నిలవడంతో వన్ వే లో వాహనాలు మళ్లించారు.స్థానిక ప్రజలు మరియు ప్రయాణికులు మాట్లాడుతూ వెంటనే ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడగలరని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



**అమనగల్లు, మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఐఎన్టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదల కోసం ఇళ్ల కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం అభినందనీయమని ఈ సందర్భంగా ప్రసాద్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్మీ స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి..

నలుగురు పిల్లలు మృతి



**ఢీల్లి మే 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న దాయాది దేశం పాకిస్థాన్ లో తాజాగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఓ పాఠశాల బస్సును సూసైడ్ బాంబ్ కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు.స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీ పబ్లిక్ స్కూల్ కు చెందిన బస్సు ఈ ఉదయం పిల్లల్ని తీసుకొని వెళ్తోంది. ఆ సమయంలో దానిని లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. సూసైడ్ బాంబ్‌తో వచ్చిన కారు బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటన బలోచిస్థాన్ లోని కుజ్‌దార్ ప్రావిన్స్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనలో నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 38 మంది గాయపడినట్లు కుజ్‌దార్ జిల్లా సీనియర్ అధికారి యాసిర్ ఇక్బార్ దస్తి తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ పిల్లల్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఈ దాడిని పాకిస్థాన్ ఇంటీరియర్ మినిస్టర్ మొహసీన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. ఇక ఇప్పటివరకు ఏ గ్రూపు ఈ దాడికి బాధ్యత వహించలేదు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి



**కల్వకుర్తి,మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి పట్టణంలో భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ, 34వ వర్ధంతి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షులు సిమ్ములు శ్రీకాంత్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లెపల్లి జగన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల దామోదర్ రెడ్డి, చిత్తారి శీను, సాబీర్, శ్రీకాంత్, సుభాని, ఉస్మాన్ శ్యామ్, ఇన్న శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు, రేష్మ బేగం, రే హన బేగం, యువ నాయకుడు దున్న సురేష్, నవీన్,శివ,పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఏం జరుగుతుంది..?

- విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డ జూనియర్ లెక్చరర్
- కరువైన గురుకుల విద్యార్థుల వ్యక్తిగత భద్రత
- 5వ తరగతికే బాలికకు నెలసరి
- ఆస్పత్రికి తీసుకెళ్లగా బయటపడ్డ దారుణ నిజం




**జగిత్యాల,మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఓ దారుణ ఘటన వెలుగుకులోకి వచ్చింది గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని వార్షిక పరీక్షల అనంతరం సెలవులు ఇవ్వడంతో ఇంటికి వెళ్లగా నెలసరి వచ్చింది. ఇంత చిన్న వయస్సులోనే నెలసరి రావడంతో కంగారుపడిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా దారుణ నిజం బయటపడింది. గురుకుల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు అక్కడ పనిచేసే ఓ జూనియర్ లెక్చరర్. వివరాల్లోకి వెళ్తే..మెట్ పల్లిలోని ఓ సోషల్ వెల్‌ఫేర్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై జూనియర్ లెక్చరర్ లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది వార్షిక పరీక్షల అనంతరం వేసవి సెలవుల కోసం ఇంటికి వెళ్లిన బాలికకు చిన్న వయసులోనే నెలసరి రావడంతో తల్లిదండ్రుల ఆందోళన చెందారు. బిడ్డ ఆరోగ్యం విషయంలో అలసత్వం వహించడకుండా పలు ఆసుపత్రులకు తీసుకెళ్తారు తల్లిదండ్రులు కరీంనగర్‌కు చెందిన వైద్యురాలు బాలికపై ఎవరైనా అత్యాచారయత్నం చేశారేమోనని అనుమానం వ్యక్తం చేసింది. డాక్టర్ సూచన మేరకు ప్రశ్నించగా..గత నెలలో ఒక జూనియర్ లెక్చరర్ తనను గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చెప్పింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం..పోక్సో కేసు నమోదు చేసి జూనియర్ లెక్చరర్‌ను రిమాండ్‌కు తరలించారు. బాలికల భద్రత పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోని గురుకుల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.


# తలకొండపల్లి మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ వర్ధంతి,



**తలకొండపల్లి,మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తలకొండపల్లి మండల కేంద్రంలో దివంగత నేత భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, పిసిసి కిసాన్ సెల్ కార్యదర్శి డి.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, అంజయ్య గుప్తా,ఎండి అజీమ్,మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు, ఎండి ఆరిఫ్, నాయకులు బోల యాదగిరి, తుమ్మ నరసింహ, నరసింహారెడ్డి, పెంటయ్య, రమేష్, వెంకటేష్, పోతగంటి గణేష్, మీసేవ మల్లేష్, రాజేందర్, నూకం శేఖర్, దేశ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహం..

రైలు నుంచి విసిరేసినట్లు అనుమానం



**బెంగళూరు మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైల్వే వంతెన సమీపంలో ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేస్తున్నారు. యువతిని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి కదులుతున్న రైలు నుంచి బయటకు విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం హొసూర్ ప్రధాన రహదారిలోని పాత చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో, రైలు పట్టాల దగ్గర నీలం రంగులో ఉన్న ట్రావెల్ సూట్‌కేస్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రావెల్ బ్యాగ్‌లోని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. హతురాలి వయసు 18 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. ఆమెను ఎక్కడో హత్య చేసి సూట్‌కేసులో మృతదేహాన్ని కుక్కి కదులుతున్న రైలు నుంచి విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. తమ ప్రాంతం పరిధిలో మృతదేహం లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు వివరించారు.

# ఇక వారికి స్థాన చలనమే

- ఒకే ప్రాంతంలో తిష్టవేసిన పీఏసీస్ ల సీఈవోలకు చెక్
- 30 ఏళ్లుగా చైర్మన్లకు తలనొప్పిగా మారిన కొందరు సీఈవోలు
- జీవో 44 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్ల సైతం బదిలీలు




**హైదరాబాద్,మే 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) సీఈవోలను ఎట్టకేలకు బదిలీచేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభు త్వం జీవో 44ను జారీ చేసింది. దీంతో దశాబ్దాల తరబడి సొసైటీల్లో ఉండి, ఆ సొసైటీలను దెబ్బతీయడమేగాక రైతుల ద్వారా ఎన్నికైనా సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్ల ను లెక్కచేయకుండా పెత్తనం చెలాయిస్తూ తలనొప్పిగా మారిన సీఈవోలు బదిలీ కానున్నారు. దీంతో సొసైటీల్లో ఇబ్బందులు తొలగి అభివృద్ధి పథంలోకి వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107 పీఏసీఎసలు ఉన్నాయి. చాలా సొసైటీల్లో 30 ఏళ్లకుపైగా సీఈవోలు తిష్ఠ వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతుల కోసం ఏర్పడిన జి ల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 107 ఏళ్లకుపై గా చరిత్ర ఉంది. చాలా మంది సొసైటీ చైర్మ న్లు పలుమార్లు ఎన్నికై విధులు నిర్వహిస్తున్నా రు. అయితే పలు చోట్ల సీఈవోలే షాడో చైర్మన్లుగా వ్యవహరిస్తూ చైర్మన్లను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ప్రతీ సొసైటీకి చైర్మన్ ఐదేళ్లపా టు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సీ ఈవోలు మాత్రం ఉద్యోగ విరమణ చేసేంత వరకు తమను ఏమీ చేయలేరనే ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా సోసైటీల్లో చైర్మన్‌కు, సీఈవో మధ్య పొసగక సమస్యలు జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతినే వరకు దారితీసింది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో బ్యాంకు రూ.2,750కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతూ రూ.3వేల కోట్ల టర్నోవర్‌ను చేరుకునేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల సీఈవోలతో పాటు స్టాఫ్ అసిస్టెంట్‌ల బదిలీకి నిర్ణయించింది. మూడు నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని వెంటనే బదిలీ చేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా, బదిలీలకు ప్రభుత్వం జీవో జారీచేసింది.

**- ఎస్ఎల్ఈసీ మార్గదర్శకాల మేరకు**

పీఏసీస్ లలో సీఈవోల బదిలీలను టెస్కాబ్ పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టెస్కాబ్ అధికారులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియపై దృష్టి సారించారు. స్టేట్ లెవల్ ఎన్‌పవర్‌మెంట్ కమిటీ (ఎస్ఎల్ఈసీ) మార్గదర్శకాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 107 సొసైటీలకు చెందిన సీఈవోలను, స్టాఫ్ అసిస్టెంట్‌లను ఎక్కడి నుంచి ఎక్కడికైనా బదిలీ చేసే వీలుంది. ఇప్పటి వరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు బ్రాంచ్‌లలో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేపట్టారు. సొసైటీల్లో మాత్రం కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేపట్టారు. సొసైటీల్లో మాత్రం సీఈవోల బదిలీలపై దృష్టి సారించలేదు. ఏళ్ల కొద్దీ సొసైటీల్లో సీఈవోలు కొనసాగుతూ వచ్చారు. కొన్ని నెలల క్రితం సొసైటీల పాలకవర్గాలు సీఈవోలను తొలగించాలని తీర్మానాలు చేసి డీసీఈవోలతో పాటు డీసీసీబీ సీఈవోకు, టెస్కాబ్‌కు సైతం వాటిని పంపినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో చైర్మన్‌లు, డైరెక్టర్లు పదవుల్లో ఉన్నా మాట ఖాతరు చేయని ఉద్యోగి, రైతులను ఎలా లెక్కలోకి తీసుకుంటారని ఆవేద చెందుతూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యాక జిల్లా కేంద్రంలో జరిగిన మొదటి సమావేశంలోనే సీఈవోల బదిలీల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలుమార్లు బదిలీ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు అధికారులు బదిలీలకు జీవో 44ను జారీ చేశారు. త్వరలో డీఎల్ఈఎస్ సమావేశం రాష్ట్ర ప్రభుత్వం సీఈవోలను, స్టాఫ్ అసిస్టెంట్‌లను బదిలీ చేయడానికి నిర్ణయించి జీవో జారీ చేయడంతో ఎస్ఎల్ఈసీ సమావేశం హైదరాబాద్‌లో రెండు, మూడు రోజుల్లో నిర్వహించనున్నారు. ఎస్-ఎల్ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డీఎల్ఈసీ సమావేశాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తారు. గతంలో డిస్ట్రిక్ లెవల్ ఎంపార్డ్ కమిటీ(డీఎల్ఈఎస్) ఏనాడు భేటీ అయిన సందర్భం లేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్‌తో పాటు డీసీసీబీ సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. వాస్తవానికి ఈ కమిటీ ఎప్పటికప్పుడూ సొసైటీల్లో చైర్మన్లు, సీఈవోలకు ఇబ్బందులు వచ్చినప్పుడు సమన్వయపర్చడం, అవసరమైతే సీఈవోను బదిలీ చేయడం వంటివి చేయాలి. ఏళ్లుగా సీఈవోల బదిలీల విషయంలో టెస్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడం, డీఎల్ఈఎస్ సమావేశాలు నిర్వహించకపోవడంతో ఇంతకాలం సీఈవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఎట్టకేలకు బదిలీల జీవో జారీ కావడంతో డీఎల్ఈఎస్ భేటీ అయి సొసైటీల పరిస్థితులను అంచనా వేసి దీర్ఘకాలికంగా తిష్ఠవేసిన సీఈవోలకు స్థానచలనం కల్పించనున్నారు.

**- సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు**

**- కుంభం శ్రీనివాస్ సరెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్**

దీర్ఘకాలికంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సీఈవోలను బదిలీ చేయాలని పాలకవర్గం విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జీవో 44ను జారీ చేసినందుకు కృతజ్ఞతలు. అదేవిధంగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకార వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఎస్ఎల్ఈసీ మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఉమ్మడి జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. అందుకు నాలుగైదు రోజులలోనే కమిటీని కూడా ఏర్పాటు చేస్తాం. తమ పాలకవర్గం ఆధ్వర్యంలో రూ.3వేల కోట్ల టర్నోవర్‌ను త్వరలో చేరుకుంటాం. ఈ నేపథ్యంలో సొసైటీలకు మరింత బలం చేకూర్చేలా జీవో నెంబర్ 44 జారీ కావడంతో బదిలీలకు మార్గం సుగమమైంది.

# నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణ


సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ధి పొందారు
ప్రత్యేక కోర్టులో ఇడి సంచలన ఆరోపణలు



**న్యూఢిల్లీ మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు లబ్ధి పొందారని పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ధి పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# భారీగా పెరిగిన ఆసియా సింహాల సంతతి..

- ప్రకటించిన గుజరాత్ సీఎం



**న్యూఢిల్లీ మే 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గుజరాత్ లో ఆసియా సింహాల సంతతి భారీగా పెరిగింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు సింహాల జనాభాపై నిర్వహించిన 2025 గణాంకాలను విడుదల చేశారు. ఐదేళ్ల క్రితం 674గా ఉన్న సింహాల సంఖ్య ఈ ఏడాది ఇప్పటి వరకూ 891కి పెరిగినట్లు చెప్పారు.మీడియాతో బుధవారం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆసియా సింహాల సంఖ్య 891కి పెరిగింది అని ప్రకటించారు. జూన్ 2020లో ఆ సంఖ్య 674గా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఈ సింహాలు జీవిస్తున్నట్లు చెప్పారు. జునాగఢ్, గిర్ సోమనాథ్, భావ్‌నగర్, రాజ్‌కోట్, మోర్బి, సురేంద్రనగర్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, అమ్రేలి, పోర్ బందర్, బోటాడ్‌లో ఈ సింహాలు విస్తరించినట్లు సీఎం చెప్పారు. మే 10- 11 తేదీల్లో సింహాల ప్రాథమిక జనాభా గణన నిర్వహించగా, తుది జనాభా గణనను మే 12-13 తేదీల్లో ప్రాంతీయ, జోనల్, సబ్-జోనల్ అధికారులు, ఎన్యూమరేటర్లు, అసిస్టెంట్ ఎన్యూమరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు సహా 3,000 మంది స్వచ్ఛంద సేవకుల సహాయంతో నిర్వహించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అటవీ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో గిర్ అడవుల్లోని సింహాల సంఖ్య పెరుగుతోందని ఆయన తెలిపారు.